# కవిరాయని కవితలు



డా॥ విమలాకర్ రెడ్డి

# కవి రాయని కవితలు

డా॥ విమలాకర్ రెడ్డి

– టీం విమలాకర్

ప్రతులు : 100

ప్రథమ ముద్రణ : నవంబర్, 2020

కవర్ పేజి డిజైన్ : రామరాజు గారు

డి.టి.పి : శ్రీనివాస్

ఎడిటింగ్ & ప్రింటింగ్ : నవదుర్గా గ్రాఫిక్స్

ప్రతులకు : టీం విమలాకర్
రూం నెం. 15, మెయిన్ బిల్డింగ్,
సన్‌షైన్ హాస్పిటల్,
సికింద్రాబాద్–500 003.
ఫోన్ : 7680924108 / 8220721103
ఇ–మెయిల్ : teamvimalakar@gmail.com
vimalakarreddy@gmail.com

ప్రేమతో



నమిత కు...



# ముందుమాట

ఒక మంచి డాక్టరు ఒక మంచి మనిషి నుంచి, ఒక మంచి మనసులో నుంచి మాత్రమే ఆవిష్కరించబడతాడు అని నా గట్టి నమ్మకం. విమలాకర్ ఓ మంచి డాక్టర్‌గా నాకు పదేళ్ల నుంచి తెలుసు. ఈ కవితలు చదివిన తర్వాత ఆ డాక్టర్ గుండెలో ఆర్తి, ఆర్ద్రత ఉన్నాయని తెలిసింది.

ఈ కవితలన్నీ, నమ్మకం, స్నేహం, ప్రేమ, సమానత్వం లాంటి అందమైన ఆలోచనల ఆలంబనగా అల్లుకున్న సంకలనం. గమనిస్తే ఈ విలువల సాయంతోనే విమలాకర్ ఇంత ఎత్తుకు ఎదిగాడు అని అనిపిస్తుంది.

పదిహేనేళ్ళ ప్రయాణంలో, కవితా ధోరణిలో మార్పులు చాలా స్పష్టంగా కనబడుతున్నాయి. మొదట్లో ఓ రకమైన నిర్లిప్తత, నిరాశ, పేదరికం మీద కసి, తర్వాత గెలవాలనే పట్టుదల ఆ తర్వాత జీవితంలో ఓ పది మెట్లు ఎక్కిన నేపథ్యంలో చెట్టు వేళ్ళు మర్చిపోకుండా నేల మీదే కాలు ఆనాలి అనే తపన ఈ కవితల్లో చాలా అందంగా, సున్నితంగా ప్రవేశపెట్టబడ్డాయి.

అమ్మ అమాయకత్వం, ఇంట్లోని తాగుబోతు తనం కూడా కవితా వస్తువులుగా మలచుకొని తద్వారా తన భావోద్వేగాన్ని, అంతర్మథనాన్ని మనందరికీ నిక్కచ్చిగా చెప్పిన తీరు అభినందనీయం.

విమలాకర్ ఇలానే మంచి మనిషిగా నలుగురికి సాయం చేస్తూ, మంచి డాక్టర్‌గా గాయం మానుస్తూ తన భావుకతను మాసిపోకుండా చూసుకుంటూ మరిన్ని కవితలు రాయాలని మనసారా ఆశీర్వదిస్తున్నాను.

- గురవా రెడ్డి

మెనేజింగ్ డైరెక్టర్
సన్‌షైన్ హాస్పిటల్స్

5 నవంబర్ 2020
సికింద్రాబాద్

## నా మాట

కవితలు అనేవి ఉంటాయని తెలుసు, అడపాదడపా పేపర్లలో చదివిన గుర్తుంది, కాని ఈ ప్రక్రియకి ఒక విధానం ఉంటుందని, దాన్ని ఎలా వ్రాయాలో అని మాత్రం నాకు తెలియదు. ఒక మనిషిలోని భావాలకు అక్షర రూపమే కవిత అని నాకు మొదట కవిత వ్రాసిన తర్వాత అర్థమయ్యింది.

ఇక్కడ నేను ఒక్కటి చెప్పదల్చుకున్నాను, నా కవితలు 2004-2019 మధ్య, అంటే 15 సంవత్సరాలవ్యవధిలో 19 మాత్రమే వ్రాయగలిగాను. ఈ మొత్తం కవితలు నాకు మనసులో నుంచి వచ్చినప్పుడు, ఆయా పరిస్థితులను బట్టి, నా మానసిక స్థితిని బట్టి వ్రాయడం జరిగింది. ఇందులో అక్కడక్కడ కొంచెం అతిశయోక్తి ఉండొచ్చు కాని, ఆ క్షణం నా మనసులో ఉన్న బావాలకు ఈ అక్షరాలు ప్రతీకలని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. ఈ కవితలన్ని వరుసగా చదువుతుంటే నా ఆలోచనా విధానంలోని మార్పును, మానసిక పరిపక్వతను గమనించగలరని ఆశిస్తున్నాను.

ఇక నా పిచ్చి వ్రాతలను మొదట పేపర్లలో వ్రాసి పడేస్తె నా ప్రాణమిత్రుడు డా॥ మహేందర్ ఒక డైరిలో వ్రాసి పెట్టడం జరిగింది,

ఆ తర్వాత నా శ్రీమతి నమిత ఆ బాధ్యత తీసుకొని కంటిన్యూ చేసింది.

ఎంతో కాలంగా నా కుటుంబ సభ్యులు, మిత్రులు దీన్ని పుస్తక రూపంలోకి తీసుకురమ్మని చెప్పినప్పటికి సమయబావం వల్ల చేయలేకపోయాను. ఇప్పుడు నాకు తెలియకుండా డా॥ గౌరాంగ్ మరియు మిగతా నా డిపార్ట్‌మెంట్ మిత్రులు కలిసి అచ్చువేయించినారు. దాని తర్వాత నేను కొన్ని మార్పులు చేర్పులు చేసి ఈ ప్రతిని మీ ముందుంచుతున్నాను.

నా ఈ చిన్న ప్రయత్నాన్ని మీరంతా ఆస్వాదించి, దీవిస్తారని ఆశిస్తూ...

మీ

విమలాకర్ రెడ్డి

10 నవంబర్ 2020
సికింద్రాబాద్

# ధన్యవాదములు

మొదటి నుండి నేను వ్రాసిన కవితలను మెచ్చుకుంటు ప్రోత్సహించిన నా మిత్రులు డా॥ మహేందర్, డా॥ మహేష్, డా॥ రామ్మోహన్‌కు, అడగగానే నామీద అభిమానంతో నా కవితలను చదివి, విశ్లేషించి, ముందుమాటను అందించిన, నా పితృ సమానులు, మార్గదర్శకులు డా॥ గురవారెడ్డి గారికి,

అనుక్షణం నన్ను అన్ని విషయాలలో ప్రోత్సహిస్తూ, నా వెన్నంటి ఉంటూ నా ఎదుగుదలలో ఒక ముఖ్య భూమిక పోషిస్తున్న నా శ్రీమతి నమిత రెడ్డికి,

జన్మనిచ్చి ఎన్నో మానవతా విలువలను నేర్పిన నా తల్లిదండ్రులకు, అన్నా వదినలకు, నన్ను ఎల్లవేళలా ప్రోత్సాహించిన అత్తమామలకు,

నేనేం చేసినా నన్ను చిన్నపిల్లడిలా లాలించే నా పిల్లలు రవళి, రనిత్, రోషిణి, రోహిత్, రన్విత మరియు రజ్వికలకు,

వీటిని పుస్తక రూపంలోకి తేవడానికి కష్టపడ్డ నా డిపార్ట్‌మెంట్ మిత్రులు డా॥ దినేష్‌రెడ్డి, డా॥ బాలారెడ్డి, డా॥ గౌరాంగ్, డా॥ ఫణి, డా॥ రాజు, గిరి మరియు తేజలకు,

అందమైన కవర్‌పేజిని శ్రమకోర్చి డిజైన్ చేసిన రమణరాజు గారికి, విసుగులేకుండా డి.టి.పి. చేసిన శ్రీనివాస్ గారికి మరియు నవదుర్గా గ్రాఫిక్స్ వారికి.

అంతే కాకుండా నన్ను ప్రోత్సాహించిన ఎందరెందరో ఆత్మీయ మిత్రులకు సదా రుణపడి ఉంటానని తెలుపుతూ,

5 నవంబర్ 2020<br>సికింద్రాబాద్

మీ<br>విమల్

# విషయ సూచిక


| | |
|---|---|
| స్నే"హాని"కి విన్నపం...! | 1 |
| అంతిమ యాత్ర | 3 |
| కవిత | 6 |
| ప్రియా | 8 |
| ఆలోచన | 10 |
| సమానత్వం | 12 |
| మన తెలంగాణ | 14 |
| డీఎన్‌బీ | 16 |
| నా గురువు | 18 |
| దేవుడు వెలిచాడు | 20 |
| మరవకు సుమా...! | 23 |
| విజయం | 25 |
| పేదరికం | 26 |
| నటన | 28 |
| నాటకం | 30 |
| నమ్మకం | 32 |
| రాయాలనిపిస్తోంది | 34 |
| నా ఊరేమిచ్చింది | 37 |
| సన్‌షైన్ | 40 |
| గురుదక్షిణ | 42 |

# స్నే"హాని"కి విన్నపం...

నాదొక వింత ప్రపంచం
ఆ ప్రపంచానికి రాజుని నేనే
కానీ! ప్రతిరోజు, ప్రతిక్షణం సందేహమే
ఎందుకంటే ఆ విశ్వంలోని ప్రతి అనువణువూ నీ కోసమే ఆరాటం
నువ్వంటే నాకభిమానం కానీ అది నీలో దొరకదు నా కోసం.
పోనీలే దురదృష్టం అనుకుంటే ఊరుకోదు మనసు
ఆత్మాభిమానం వెక్కిరిస్తుంది ప్రతిక్షణం
నాకు తెలుసు నేనేం పాపం చేయలేదని
కానీ ఆ శిక్షకు కారణం తెలుసుకోవాలని
దీన్ని భరించే ధైర్యం లేదని చెప్పాలని నా ఆశ
నాకు నీ కన్నా మంచి స్నేహితులున్నారని తెలుసు
కానీ నా మనసు నిన్ను కూడా వదలనంటోంది
నీ మనసొక ఎడారి అని తెలుసు
అయినా అందులో నీటికోసం వెతుకుతున్నాను
అది నా అమాయకత్వమో... అభిమానమో తెలియదుకానీ
దాహార్థికోసం మాత్రం కాదు.
చదవాలని వున్నా చదవలేకపోతున్నా
తినాలని వున్నా తినలేకపోతున్నా

ప్రతి ఉదయం ఒక రవికిరణం నన్ను వెక్కిరిస్తూ మేల్కొలుపుతుంది అయినా నేను భయపడను, సిగ్గుపడను ఎందుకంటే రాత్రికి వచ్చే శశికిరణమైనా నన్ను అర్థం చేసుకుంటుందని కానీ, అదీ నన్ను చూసి పరిహసిస్తుందనేదే నా భాద మిత్రమా నీకొక విన్నపం ఈ స్వార్థ ప్రపంచంలో ఒక వ్యక్తి నీ గురించి బాధపడుతున్నాడని, నిన్ను ఇష్టపడుతున్నాడని అంటే అది నేనే॥ ఇప్పటికైనా ఈ నిర్మలమైన అంధకార ప్రపంచంలోకి నీ శశికిరణాలు ప్రసరిస్తాయని ఆశిస్తూ....!!

07-2004 : 5.00 pm

–"MBBS పైనల్ ఇయర్‌లో ఉండగా, ఒక ఫ్రెండ్‌తో మన:స్పర్థలు ఏర్పడి బాదగా ఉన్నప్పుడు అనుకోకుండానే నాదొక వింత ప్రపంచం అని గుర్తుకొచ్చి అలా మహేందర్ రూంలో చాలా అవలీలగా, ఫాస్ట్‌గా నా మొదటి కవిత వ్రాయడం జరిగింది.

అప్పటి వరకు నాకు తెలియదు నేను కవిత కూడా వ్రాయగలనని" ఈ కవితలో కొంచెం నిజానికి అతిశయోక్తి తోడైంది"

# అంతిమ యాత్ర

నేనే నీకొక చిరాకు ఐతే
నా ముఖమే నీకు అసహ్యమైతే
నా మాటే నీకు కంపరమైతే
అది నా తప్పా లేక ఆ దేవుడి తప్పా?
అందమైన ఆ పొలాలమధ్య ఆ అమాయక మూగజీవుల మధ్య
ఆ ఆనంద ప్రపంచానికి రాజుని నేను
ఏమైంది ఆనందం, ఎక్కడికెళ్లింది నా సంతోషం?
నాకింకా గుర్తు ఆ అందమైన బడిలో
నేనే రాజును అని అన్నారు
అది ఆ అమాయకులతప్పా, లేక ఆ దేవుడి తప్పా?
చిరిగిన బట్టలతో కాలికి చెప్పులు లేని
పేడ ఎత్తే ఆ రోజులు నాకు స్వర్గం
విలాసమని అనుకుంటున్న ఈ రోజులు అనుక్షణం నరకం
ఏమైంది నా ఆనందం, ఎక్కడికి వెళ్లింది నా సంతోషం?
నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను మరిచాను
నన్ను కంటికి రెప్పలా చూసుకునే ఇంటిని మరిచాను
చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడిన నా గతాన్ని మరిచాను

అన్నింటికన్నా నన్నే దేవుడిలా చూసే నా లోకాన్ని మరిచాను
ఇప్పుడు నువ్వే నాలోకం, నువ్వే నా ప్రపంచం
ఈ రెండు సంవత్సరాలలో నీ గురించి ఆలోచించని క్షణం లేదు
ఇది నా అమాయకత్వమో? లేక నా అభిమానమో?
ఆరోజు పొలంగట్టు మీద కూర్చున్న రెడ్డి గారిని నేను
ఈ రోజు నీ ముందు కుర్చీలో కూర్చున్న
ఏమీ కొరగాని దరిద్రున్ని నేను
అది ఆ స్థానం తప్పా? చూసే కనులతప్పా? లేక ఆ దేవుడి తప్పా?
నీతోనే ఉండాలనుకున్నాను
నీ ఆనందమే నా ఆనందమనుకున్నాను
నీతోనే కష్ట సుఖాలను పంచుకోవాలనుకున్నాను
అది నా మనసు తప్పా? లేక ఆ దేవుడి తప్పా?
నీ మీద నాకు ప్రేమ తప్ప ఏమీ లేదు
కానీ నా మీద నీకు అసహ్యం తప్ప ఏమీలేదు
అది మన తప్పా? లేక ఆ దేవుడి తప్పా?
నా మీద అసహ్యానికి నేనే కారణమనుకోవచ్చు
కానీ నీ మీద ప్రేమకు కూడా నేనే కదా కారణం
అది గమనించలేని నీ తప్పా? లేక నా తప్పా?

విధి ఆడుతున్న ఈ మన వింత నాటకంలో నేను పావుని
ఆ పావే ఆటను భరించలేక రేపు నిర్జీవమైతే
అది ఆ విధి తప్పా? మన తప్పా? లేక నీ తప్పా?
మిత్రమా ఎదుటివాని ముఖంలో ఆనందం చూడటం నా దినచర్య
పది మంది కోసం బతకడం నా లక్ష్యం అనుకున్న
ఈ నిష్కల్మషమైన అమాయక జీవికి
ఇక అంతిమయాత్రేనా నీ సమాధానం?
చెప్పు నీ Happy Journey for this Last Journey

01-08-2004 : 7.45 pm

–"MBBS పైనల్ ఇయర్‌లో ఉండగా, ఒక ఫ్రెండ్‌తో మన:స్పర్థలు వచ్చి చాలా డిస్టర్బ్ అయి నా గడిచిన జీవితంను గుర్తుకు తెచ్చుకుంటు బాదతో వ్రాయడం జరిగింది."

# కవిత

కవి రాయని కవితను నేను,
కథకందని వ్యధ నాది,
మథనం, మథనం, మథనం,
ఇదేనా ఇక పరమార్థం?
మంచుపొరల్లాంటి నా మనసు
ఈ తాపానికి తాళలేక నీరు కావాల్సిందేనా?
అసలేం కావాలి నాకు? ఎందుకు బతకాలి నేను?
నేనెవరిని? నేను నేనేనా?
ఎన్నో ప్రశ్నలు పరిభ్రమిస్తున్నాయి నా చుట్టూ
వాటికి సమాధానం?
అదీ ఓ పెద్ద ప్రశ్నే?
ఈ చిన్న మనసుకు జవాబు దొరికేనా ఎప్పటికైనా
ఓ చల్లని చూపు, తియ్యనిమాట
నన్ను బతికించలేవా?
వైద్యుడి కందని రోగమా ఇది,
కాదు... మనిషి (నీ) కందని సత్యమనిపిస్తుంది.

08-08-2004 : 3.50pm

-"అలా రెండు కవితలు వ్రాసిన తర్వాత, ఏంటి నేనూ కవితలు వ్రాస్తున్నానే అనే ఆలోచన వచ్చి, దానికి కారణాలను వెతుకుతూ వ్రాసిన కవిత ఇది".

# ప్రియా

ప్రియా! ప్రతి ఆలోచనకు అంతం నీవే
ప్రతి బాధలో అంతరార్థం నీవే
నిన్ను చూసిన ప్రతిక్షణం నాకు నరకం
నా ప్రాణం ఎటో వెళ్లిపోతున్న బాధ
మరవాలని ఉన్నా మరవలేకున్న
నీ జ్ఞాపకాలు ప్రతిక్షణం నన్ను వెంటాడుతున్నాయి
నీ స్నేహంలోని కష్టాలు గుచ్చి గుచ్చి నన్ను వెంటాడుతున్నాయి
పగలు, రాత్రి అడ్డురావు
ప్రతి రాత్రి కలలో నీవే
ప్రతి ఉదయం మెలకువ నీతోనే
ఈ ప్రేమే నాకు శాపమా?
ఈ ప్రపంచంలో అంతా నీవే నాకనిపిస్తుంది ఒక్కోసారి
ఇంత అశాంతికి కారణమైన నీవు నాకవసరమా?
అనిపిస్తుంది ఇంకోసారి
కారణం ఎవరైనా కావచ్చు
తప్పు ఏదైనా కావచ్చు
కానీ బలిపశువును నేనయ్యాను

నీలో మార్పువస్తుందని
మన స్నేహం నిలుస్తుందని ఆశిస్తూ...


31-10-2007 : 4.35pm

–"ఇక కవిత వ్రాయగలననిపించిన తర్వాత ఒకవేళ ప్రేమ విఫలమైతే ఎలా ఉంటుందోనని ఊహిస్తూ House Surgeon లో రాసిన కవిత ఇది"

# ఆలోచన

కనులు మూసినా, కనులు తెరిచినా
జవాబు దొరకని ప్రశ్నది
అసలెందుకొస్తావో, ఎక్కడినుంచొస్తావో
దు:ఖంలో సంతోషంగా
సంతోషంలో దు:ఖంగా
మొత్తానికి చాలాసార్లు బాధగా
మమ్మల్ని ఎందుకు పీడిస్తావు
ఏసైన్సుకు అందని నీ ఉనికికి
కారణం మెదడా? మనసా?
అందుకేనేమో చిన్నపిల్లలు, బుద్ధిమాంద్యం
ఉన్నవాళ్లు అదృష్టవంతులంటారు
అసలు నీకైనా కారణం తెలుసా
ఓ ఆలోచనా! ఇప్పటికైనా నాకీ ఆలోచన
కల్పించిన నీకు నా జోహార్లు...

11-09-2009 : 10.40 pm



–"నేను ప్రతిదాన్ని ఎక్కువగా ఆలోచిస్తానని నా అభిప్రాయం దాని గురించి ఆలోచిస్తూ అసలు ఏంటీ ఈ ఆలోచనలు అని P.G లో పెళ్లయిన తర్వాత రాసిన కవిత"



# సమానత్వం

సమానత్వం, సమానత్వం
మాటలలో సమానత్వం
వేదికలపై సమానత్వం
ఆచరణలేని సమానత్వం
పేదరికాన్ని పెంచడంలోనా సమానత్వం?
బడుగులను అనగదొక్కడంలోనా సమానత్వం?
అడుక్కుంటే వచ్చేదా సమానత్వం?
కాదు! అడిగి రానప్పుడు కొనుక్కుంటే వచ్చేదా సమానత్వం?
అమాయకత్వం, చేతగానితనం రెండూ సమానమా?
గౌరవం, భరించడం రెండూ సమానమా?
దేనికోసం పోరాటం
దేనికోసం ఆరాటం
హక్కుకోసమా?
దాన్ని అడుక్కునే హక్కు కోసమా?
అసలేంటి సమానత్వం?
నిజంగా దేవుడు సృష్టించిందా ఇది
కానప్పుడు మనిషిలో ఎందుకు పుట్టింది
అయినప్పుడు ఎందుకు దొరకడం లేదు

అవును... కాదనేవి రెండూ సమానమా?
నిజంగా సమానత్వంలో అసమానత వెతుకుతున్నామా
అసమానతలో సమానత్వం వెదుకుతున్నామా
చేతగానితనం లేని అమాయకత్వంతో
భరించడంలేని గౌరవంతో,
తలెత్తుకు స్వేచ్ఛగా జీవించే
రవీంద్రుడి లోకమా సమానత్వం

06-02-2010 : 10.10 pm


–“నాలో కొంచెం అభ్యుదయ భావాలు ఎక్కువ, చిన్నప్పటి నుండి నాకెందుకో ఈ సమానత్వం అనే పదం వెనుక ఎన్నెన్నో అనుమానాలుండెవి. వాటికి అక్షర రూపమే ఈ కవిత”.

# మన తెలంగాణ

నేడు రాష్ట్రం ఒక రావణకాష్టం
అందుకే పేదోడికి నష్టం
తెలంగాణా తల్లి మనందరికి ఇష్టం
కానీ ఈ దుష్ట నాయకులు
మన ఇష్టాన్ని వికృష్టాలకు వాడుకుంటున్నారు
శ్రేష్ఠులైన నా తెలంగాణ అన్నలారా
నాదొక విన్నపం
మీ మరణం... కారాదు ఈ దుష్టులకు భరణం
మీరు లేని తెలంగాణ
ఏ తల్లీ కోరుకోదు
వివేకంతో ఆలోచించండి
విజ్ఞానంతో మేల్కొలపండి
శాంతియుతంగా తెలంగాణ సాధిద్దాం
స్వేచ్ఛగా జీవిద్దాం

28-02-2010 : 6.00 pm

-"DNB General Surgery Theory Exams Prepare అవుతున్నప్పుడు చాలా తీవ్రంగా జరుగుతున్న తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల బలిదానాలను చూసి చలించి రాసిన కవిత"



## ఓటీసీ

అయితే కొలాంజైటస్ లేకపోతే కొలైటస్
వాంతికొచ్చినా బాదే, దొడ్డికి రాకపోయినా బాదే
ఎన్నాళ్లీ చదువులు, ఎన్నేళ్లీ ఏడుపు
పెద్ద పెద్ద చదువులంటారు
ఒక్కటి రాకున్నా ఫెయిలంటారు
అయితే లాపరాటమి లేకపోతే స్కోపి
దానికి ఎందుకు మాకు ఈ బీపీ
చెతిలొక్క గవ్వలేదు, పేరుకేమో పెద్ద డాక్టరు
మనిషి మంచిగైతే కన్సెషన్
కాకపోతే దెబ్బలసెన్సేషన్
ఓరి సూదుగా
నీకు సూదిమందు తెలవదుగాని
నాకు శక్కర పుట్టిస్తున్నవు
ఎన్నాళ్లీ చదువులు, ఎన్నాళ్లీ ఏడుపులు
నా బిడ్డ లవ్వు అంటే
నేనేమో రివ్యూ అనబడితె
ఎన్నాళ్లీ చదువులు, ఎన్నాళ్లీ ఏడుపులు

28-05-2010 : 11.00 pm


-"DNB General Surgery Theory ఎగ్జామ్ ప్రిపేర్ అవుతున్నప్పుడు (అప్పట్లో పాస్‌రేట్ చాలా తక్కువ) విపరీతమైన నిరాశా భావంతో రాసిన కవిత (DNB కష్టాలు) (సూదుగా-AK Sood అప్పుడు Head / Exams registrar)".

# నా గురువు

ముని కాని మౌని
యోగి కాని జ్ఞాని
అతని ఆహార్యం వైద్యనారాయణుడికి ప్రతిరూపం
అతని మాట రోగులపాలిట తేనెమూట
సహనం ఆయన ఆయుధం
ఎంతంటే... ఒక మేధావి మౌనం నేరం అనుకునేంత
జ్ఞానం ఆయన ఆస్థి
ఎంతంటే... ఎదుటివానికి వేలుపట్టి నేర్పేంత
తన అస్థిత్వాన్ని ప్రశ్నించినా నవ్వుకునే ఒక వివేకానందుడు
ప్రతి మనిషిలో దైవాన్ని చూసే పరమాత్ముడు
ఒక నిత్య విద్యార్థి, నిత్య యవ్వనుడు
సత్యాన్ని నమ్మే శ్రీమన్నారాయణుడు
అతడే మా శ్రీ సత్యనారాయణుడు

23-03-2011 : 1.22 am

–"నా సర్జరీ HOD డా॥ సత్యనారాయణ సార్‌పై ఉన్న అభిప్రాయాలకు, అభిమానానికి అక్షరరూపం".



# దేవుడు వెలిచాడు

మరి, దేవుడే వెలవాలి.... అదీ ... మన తోటలోనే!
కాలరాత్రి కరెంటు మోటరు కొరకు వెళ్తే
ఏ నాగుపామో తనని కాపాడుకోవడానికైనా కాటేస్తే
ఎర్రటి ఎండలో, ఎముకలు కొరికే చలిలో
తోడెవ్వరు ఈ బక్క ప్రాణికి...
మరి దేవుడే వెలవాలి!
పంటంతా చేతికొచ్చిందని పులకించే సమయంలో
ఏ వడగండ్లో వచ్చి నేలమ్మను ముద్దాడితే
మరి దేవుడే వెలవాలి....! ఈ అనాథ రైతుకు
సంవత్సర కష్టార్జితంను, ఒక్క నిమిషంలో
దళారి మాయ మటలకు అప్పగిస్తే
జీవితాంతం వాడిచుట్టు అప్పులు కడ్తూ తిరిగే
అప్పుదారు, కాదుకాదు... పేపరు ప్రకారం రైతే రాజు
మరి తోడెవ్వరు ఈ బక్క ప్రాణికి... దేవుడే వెలవాలి!
నాసిరకం విత్తనాలనుంచి పంటకొనే దళారి వరకు
ఇతను... రాజే కాదు దేవుడే!
కానీ, ఇతనికి నాలుగు వ్రేళ్ళు లోపలికి పోవాలంటే
మందు డబ్బ తోడుకావాలి.... లేదా దేవుడే వెలవాలి!

రైతు తను... నలుగురికి పట్టెడన్నం పెట్టే దేవుడ్ని
అని నమ్మే రోజు వస్తుందా?
కాదు మనం కల్పిస్తామా?
దేవుడే వెలవాలి!

12-11-2012 : 7.30am

–"ఒక రోజు ఒకే రూంలో ఉంటూ, బయట వంట చేసుకుంటూ Super Speciality Prepare అవుతున్నప్పుడు మా అమ్మ ఫోన్ చేసి మాట్లాడుతూ, ఎటు వెళ్తున్నావమ్మా అని అడిగితే మన ప్రక్క వాళ్ళ తోట్లో దేవుడు వెలిచాడట చూసి వస్తాను అని చెప్పినప్పుడు, ఇలాంటి అమాయకపు ఆలోచనలవెనుక కారణాలను వెతుకుతూ ఒక రైతు గురించి రాసిన కవిత ఇది".



# మరవకు సుమా...!

ఓ రెమ్మ చాటు పూవులా
ఓ అమ్మ కొంగు చాటు పాపలా?
నీ ప్రతి అడుగును కాపుకాసె
ఆ రెమ్మను... అమ్మను
మరవకు నేస్తమా!
నువ్వు వేసే ప్రతి అడుగు ఒక ఉద్యమం కావాలని
నీ ప్రతి రోజు మరపురాని చరిత కావాలని
ఈ రవి అస్తమించని ప్రపంచానికి
నువ్వు రారాజు కావాలని కోరే
ఆ రెమ్మను..... అమ్మను మరువకు నేస్తామా!
నువ్వు నవ్వుతే నవ్వే, నువ్వు ఏడిస్తే ఏడ్చే
ఆ అమాయకపు జీవుల
ప్రతి శ్వాస, ప్రతి ఆశ
నువ్వే అని మరవకు నేస్తమా!
నువ్వు తియ్యటి ఫలాలునిచ్చే వృక్షానివై
నలుగురికి చెందాలని....
నీ నీడ ఎందరికో సేద తీర్చాలని

కోరుకునే నీ చెట్టు వ్రేళ్ళను
మరవకు సుమా!

18-03-2013 : 10.45 pm

–"నేనింత స్థాయికి ఎదిగినా నేను వచ్చిన నేపథ్యాని, నన్ను నమ్మిన, ఇష్టపడ్డ వ్యక్తులను మరవకూడదు అని ఎప్పుడూ అనుకుంటుంటాను. నాకు Super Speciality లో National Level మంచి ర్యాంకు వచ్చి Top most GI Center మీనాక్షి మిషన్ లో సీటు వచ్చినప్పుడు మరొక్కసారి నాకు నేను గుర్తుకు తెచ్చుకున్న నా బాధ్యతకు అక్షరరూపం".

# విజయం

అదిగదిగో పిలుస్తోంది విజయం
కనిపిస్తుంది! కాని... అందదనిపిస్తుంది
కవ్వించడం దాని నైజం
పరిగెత్తించడం దాని మ్యానరిజం
కాని ఒకటి నిజం....
అది పరిగెడుతుంది నిన్ను పరీక్షించడానికి మాత్రమే
నీకు అందకుండా పోవాలని మాత్రం కాదు
ఎప్పుడొస్తుందో... ఎలా వస్తుందో,
దానికి మాత్రమే తెలుసు
కానీ.... ఎవరికి వస్తుందో మాత్రం
పరిగెత్తే వాడికే తెలుసు

18-03-2013 : 11.30 pm

-"Super Speciality all India 40 rank వచ్చిన తర్వాత అంతకు ముందు ఆర్థిక, సామాజిక, కుటుంబ, ఆరోగ్యపరంగా ఎన్నో కష్టాలను చవి చూసి చివరకు ఎప్పుడు చూడని ఫెయిల్యూర్‌ని DNB Practicals లో కూడా చూసి, దాని నుండి గట్టెక్కి Super Speciality Seat సాధించినప్పుడు అసలు విజయం అంటే ఎంటో అనుకుంటూ రాసిన కవిత".

# పేదరికం...

పేదరికం కాదిది పెద్దరికం
ఇది నాకు చుట్టరికం
పుట్టింది నాతో... పెరిగింది నాతో
కష్టపడితే పోయేది కాదిది
దురదృష్టానికి ఇది అలంకారం
నేనంటే దానికి ఎంతో మమకారం
కడుపు బాధ పేదోడి బాష
పైస వాసన ఉన్నోడి శ్వాస
ఆశలు, అవకాశాలకు మధ్య
అన్యాయం, అవమానాలకు మధ్య
నలిగే దాపరికం... ఈ పేదరికం!
దాచుకుంటే దాగేది కాదిది
చెప్పుకుంటే పోయేది కాదిది
అదో శాపం అనుకుంటే గ్రహపాటే
దాన్నే ఆయుధం చేసుకుంటే ఎదుటోడికి ఉలికి పాటే

18-03-2013
08:07 PM

–"నేను ఎప్పుడు నమ్మే పేదరికం అనేది మనిషికి ఒక అదృష్టమే తప్ప శాపం కాదు అని, నా ఎదుగుదలలో పేదరికం పాత్రను గురించి రాసిన కవిత".

## నటన...

మాట, ఆట రెండూ మనసు పాటలే
మాట లేని ఆట గొప్పదా?
ఆట లేని మాట గొప్పదా?
ఆడించేవాడు, మాట్లాడించేవాడు సర్వేశ్వరుడే కదా?
మరి మనిషి మాటకు.. ఆటకు తేడాలెందుకు చూపిస్తాడు
మాట మనసుది, ఆట ఆకారానిదా?
ఆ రెండూ ఒకేలా ఉండలేవా?
ఉన్నవాడు ఇక్కడ ఉండలేడా?
మతిలేని కోతి ఆట మనిషి?
గతి లేక ఆడే ఆట మనిషి?
గెలుపోటములు లేని ఆట కదా ఇదీ!
అంతం లేని ఆట కదా ఇది!
మరి పంతమెందుకు మనిషి నీకు?
ఆట...మాట ఒకటికానప్పుడు
ఆకట్టుకోలేని ఆటను మాటతో మార్చలేవని
ఇక ఈ రంగస్థలంపై నటించలేవని తెలుసుకో!

26-03-2014 : 11.29 pm

-"MMHRCలో సూపర్ స్పెషాలిటిలో చేరిన తర్వాత వయస్సు, చదువు పెరుగుతున్న కొద్దీ మనుషులలో నటన పెరుగుతున్నట్టున్నది అనే భావనకు అక్షరరూపం".



# నాటకం

హృదయం జ్వలించింది!
మథనం కదిలించింది!
పసిపాపకు చావెందుకని...
అధముడికి అందలమెందుకని
హృదయం జ్వలించింది
మథనం కదిలించింది
నాటకం కాదిది....
జగన్నాటకమని....
ఆరంభం, అంతం రెండూ తెలియవు
అంతరార్థం అంతకన్నా తెలియదు
నటులు మాత్రమే కనిపించే నాటకం
తన పాత్ర కూడా తెలియని నాటకం
ఆడిస్తే ఆడాలి... ఆపితే చూడాలి
ప్రతి పాత్రకూ నవరసాలుంటాయి
కాకపోతే... కొంచెం హెచ్చుతగ్గులు తప్పు!
ఎవడి కూర్పు ఈ నాటకం



ఏ లెక్కలు దీనికి మూలం
ఈ జన్మఫలమా, పూర్వజన్మ ఫలమా
ఓ నాటక కర్త, సృష్టికర్త
నాదొక విన్నపం....
సృష్టించగానే శిక్షించడమెందుకు
పాపిని కూడా పరమాత్ముడిగా చిత్రీకరించడమెందుకు
నాయాన్యాయాలకు చోటు లేదా నీ ఆటలో
కాలానికి అనుగుణంగా మార్చగలవా నీ ఆటను
చిరునవ్వుల ముగింపు చేర్చగలవా నీ నాటకానికి

09-11-2015 : 2.00 am

-"DNB GI Surgery Exams Prepare అవుతున్నప్పుడు ఒక రోజు 12 గం॥లరాత్రి వరకు నేను, గంగాధర్ చదువుతు హాస్టల్‌లో బుక్స్ పెట్టిపోతున్నప్పుడు క్యాన్సర్ వార్డు నుంచి ఒక చిన్న పిల్లవాడ్ని వారి తండ్రి తీసుకొని నడిపిస్తు... అతని పై ఉన్నా లైనులు, ప్లాస్టర్లు, బాదని... చూసి చలించి ఇంటికి వెళ్ళిన తర్వాత పడుకోలేక లేచి బాధతో రాసిన కవిత".



# నమ్మకం

అమ్ముకోకు, అమ్ముకోకు నమ్మకాన్ని
అది మొదలైంది అమ్మపాలతో
పెరిగింది నాన్న ప్రేమతో
పరిణితి చెందింది గురువు బోధతో
కలవడానికి కారణాలెన్నో,
కాని కలిసుండడానికి మాత్రం నమ్మకమొక్కటే కారణం.
అది లేని చోట ఉండదు స్నేహం,
నడవదు కుటుంబం,
నిలవదు ఏ బంధం,
ఇలలో సాటిలేనిది నమ్మకం
వెలకట్టలేనిది నమ్మకం
అవసరంతో పోయేది కాదీ నమ్మకం
అరువు తెచ్చుకుంటే వచ్చేది కాదీ నమ్మకం
వస్తూ పోయేవి అవసరాలు
వస్తే పోకూడనిది నమ్మకం
ఆశలప్రపంచంలో నమ్మకం అమ్ముడై పోతే
మోసం చేయడం ఓ కళ అయిపోతే

ఎవరు గెలిచేది?
నమ్మేవాడా? నమ్మించేవాడా?
కానీ ఒకటి నిజం
నమ్మితే లేదు ఏ నష్టం, కొంచెం కష్టం తప్ప
నమ్మకం కోల్పేతే మాత్రం మరణంతో సమానమనేది సుస్పష్టం.

03-06-2017 : 9.23 pm

-"Sunshine Hospital లో చేరిన తర్వాత నమ్మకంతో చేర్చుకున్న నా క్రింది స్థాయి ఉద్యోగిలో వచ్చిన మార్పులను గమనిస్తూ రాసిన కవిత".

## రాయాలనిపిస్తోంది

రాయాలనిపిస్తోంది, రాయాలనిపిస్తోంది!
మత్తువల్ల చిత్తయిన కుటుంబాల గురించి
ఎంత చెప్పినా తీరని వ్యథల గురించి
తిరిగిరాని చెదిరిపోయిన బాల్యం గురించి
అన్నార్థుల ఆక్రందన గురించి
రాయాలనిపిస్తోంది, రాయాలనిపిస్తోంది!
అర్థంకాని కష్టాలు, తీరని ఇష్టాలు
భరించలేని వయస్సు
బరువైన మనసు
ఇంతకు మించి ఏంరాయాలి
నువ్వు తాగుతూ, తూలుతూ వచ్చావు
అమ్మా నేను అలిసి, సొలిసి పోయాము
మా ఆకలి కేకలకు నీ అరుపులు తోడయ్యాయి
జనం గుమికూడతారేమోననే భయం
ఇంట్లో గిన్నెలు, మా ఒళ్ళు ఇక సిద్దమయ్యాయి
పరువు, అనేది లేదని తెలిసినా
ఇంకా కాపాడుకోవాలనే ఏదో తపన
ప్రాణం పోతున్నట్టుంది నాన్నా,

ఈ పసిమనసులో ఏన్నో ప్రశ్నలు
ఎందుకు కన్నావు నాన్న?
మేం చేయని తప్పుకు మాకెందుకు ఈ శిక్ష?
మాకూ.... అందరిలానే ఉంటే బాగుండు అని
గట్టిగా ఏడవాలని పిస్తుంది నాన్న
కానీ నీకు తెలియకుండానే ఒక సహాయం చేస్తున్నావు
నువ్వు లేకుండానే ఈ ప్రపంచాన్ని చూడ్డం అలవాటవుతుంది
దొరకనిదేదో పొందాలనే తపన
ఏదో సాధించాలనే కసి
ఎంతంటే నా విజయం చేసే ధ్వనికి ఇక జనం గుమికుడేంతగా!

26-11-2017 : 10.35 pm

"ఓ రోజు వరంగల్‌లో Work Shop లో Live Surgery చేసి తిరుగు ప్రయాణంలో నేను బాలారెడ్డి వస్తున్నప్పుడు, చాలా తక్కువగా మాట్లాడే నా డ్రైవర్ వాళ్ళ ఇంటి పరిస్థితులు, వాళ్ళ నాన్న గురించి చాలా సేపు చెప్పిన తర్వాత అవన్ని నాకు నా ఇంట్లో నేను మా పిల్లలు ఎదుర్కొన్న వాటిలాగే అనిపించి మద్యంకు బానిస అయిన కుటుంబాలగురించి చాలా మధనంతో రాసిన కవిత".



# నా ఊరేమిచ్చింది

నా ఊరేమిచ్చింది
అవును! ఏమిచ్చింది?
పటేండ్లు పోతుంటే దండాలు పెడుతూ చెప్పులు చేతిలో
పట్టుకోమన్న బానిసతత్వాన్నిచ్చిందా?
నా ప్రాణమిత్రునికి కూడా వేరే గ్లాసులో టీ పోస్తే ఏడ్చి
అస్పృశ్యతను ఎదురించడం నేర్పిందా?
అణగదొక్కబడుతూ అణగదొక్కకూడదు అనే పాఠాన్ని నేర్పింది
కాబోలు!
నాకుటుంబం ఎదుగుతుంటే ఓర్వలేక కుళ్ళు రాజకీయాలు చేసిన
నిమ్న సమాజాన్ని చూపిందా?
ఏ కులం వాన్నైనా, ఏ స్థాయి వాన్నైనా అత్తా, మామ, అన్నా తమ్మి
అనే ఆప్యాయతను నేర్పిందా?
మనిషిని ప్రేమిస్తూ మనిషిలోని చెడును జయించడం నేర్పింది
కాబోలు!
బర్లు, ఎడ్లు, తోట, తిట్లుకొట్లతో ఒకింత తీపి గాయాలతో కూడిన
బాల్యాన్ని చూపిందా!

గొప్ప గురువులవద్ద చదువు, సంస్కారం, సాధించాలనే తపన నేర్పిన

నా అందమైన బడిని ఇచ్చిందా?
కష్టం, జ్ఞానం, నడవడికలలో సమతుల్యత నేర్పింది కాబోలు!
చెడు అలవాట్లని నా ఇంట్లోకి దూర్చి వ్యక్తిపై సమాజపు గెలుపు

చూపిందా?
నన్నెప్పుడూ ప్రేమిస్తూ గౌరవించే, ఓ వ్యక్తి మంచి గుణగణాలు

కుటుంబ గౌరవాన్ని కాపాడగలవని నిరూపించిందా?
మంచి వ్యక్తిత్వం, ఆరోగ్యకరమైన సమాజం గొప్ప ప్రపంచాన్ని

సృష్టించగలవని నేర్పింది కాబోలు!
వాడికి టీ.బి. వుంది. ఇంట్లో తాగుబోతులు పిల్లనివ్వద్దు అని చెప్పిన

కర్కష సమాజాన్ని రుచి చూపిందా?
పిల్లోడు చాలా మంచోడు మీరు అదృష్టవంతులు పిల్లనివ్వండి
అని చెప్పిన ఎందరో మంచి మనుషులను చూపిందా?
చెడు, మంచి అనేవి జీవితంలో రెండు పార్శ్వాలు అని నేర్పింది

కాబోలు!
ఏది ఏమైనా
మనిషిని మనిషిగా చూడమని, కష్టాన్ని నమ్ముకోమని,

తెలివికన్నా నడవడిక ముఖ్యమని,
మంచి చెడులను అర్థం చేసుకొని నిరంతరం
ముందుకు సాగమని
ఎంత ఎదిగినా ఒదిగి ఉండమని నేర్పింది నా ఊరు...

16-12-2018 : 10.52 pm

–"ఓ రోజు ఆదివారం ఈనాడు సండే బుక్‌లో కొలకలూరి ఇనాక్ జీవితం గురించి చదువుతున్నప్పుడు అతను ఊర్లో ఎదుర్కొన్న సంఘటనలను వివరిస్తున్నప్పుడు, నాకూ, ఎప్పుడూ అనిపించే ఒక భావన నా ఊరెమిచ్చింది అనే ఆలోచనలప్రతిరూపమే ఈ కవిత".


# సన్‌షైన్

పసుపు పచ్చ పారాణి పూసుకున్న నా వెన్నెల్లో ఆడపిల్ల
నుదుటిపై ఎర్రని తిలకం దిద్దుకున్న నా సాహసాల కన్నెపిల్ల
నలుపును అందంగా మలుచుకొని పరిగెడుతున్న
నా అందమైన లేడిపిల్ల
ఇదే నా పది వసంతాల ఆరోగ్య ఖిల్లా

రోగులకు సేవచేసే శక్తినివ్వు భగవంతుడా అనే ప్రార్థనా స్ఫూర్థితో
రోగి సాంత్వనే ప్రాథమిక ధ్యేయం అనే నినాదంతో
స్నేహం ఆస్థిగా, మానవతా విలువలు పెట్టుబడితో
వేసిన బీజమే నా ఈ పది వసంతాల వైద్య వృక్షం

దుర్గ జనన ఘడియల శక్తి నీకు తోడవ్వాలని
సూర్యరశ్మిలాంటి వెలుగు నువ్వు నలుగురికి పంచాలని
కీళ్ళ మార్పిడిని ఈ దేశంలో ఉద్యమంలా మార్చాలని
చేసిన ప్రయత్నమే నా ఈ పదివసంతాల ఆరోగ్య దేవాలయం

నీ పెంపకం నాకో మధురానుభూతి
నీ వైద్యం ఎందరో రోగులకు తీర్చెను భీతి



నీ ఆశ్రయం ఎందరోవైద్యులకు నేర్పెను నీతి
వెరసి నువ్వు నిలిపావు నా ఖ్యాతి

అంచెలంచెలుగా నువ్వెదుగుతుంటే ఆనందపడ్డాము
నిమ్నమనుస్కులు నిన్నుగాయపరిస్తే బాదపడ్డాము
ఆశలు, అవసరాలు, ఆవరోదాల మధ్య నువ్వు
కొట్టుమిట్టాడుతుంటే మదనపడ్డాము
ఓ పెద్దన్న సాయంతో ఇప్పుడు మనందరం ఒడ్డున పడ్డాము

నీ ఖ్యాతి వైద్యరంగంలో నలుదిశలా వ్యాపించాలని
నీ సేవలు ఇంకెందరో రోగులకు సాంత్వన చేకూర్చాలని
“మానవుడే నా సందేశం, మనుష్యుడే నా సంగీతం” అని

చాటుతూ
రవి అస్తమించని సామ్రాజ్యంలో నువ్వు రారాజుగా వెలగాలని
ఆశిస్తూ....... దీవిస్తూ .........
నీ గురఖారెడ్డి Sorry గురవా రెడ్డి

09-05-2019
11:06 PM

-“ఒక రోజు గురవారెడ్డి గారు Thursday మీటింగ్‌లో, విమల్, ఈ 10 సంవత్సరాల Sunshine Journey సందర్భంలో ఒక కవిత వ్రాయు అని అడిగినప్పుడు వ్రాసిన కవిత”.

# గురు దక్షిణ

ఒక చిన్న పల్లెటూల్లో ఆదిలాబాద్ జిల్లా (ప్రస్తుతం నిర్మల్ జిల్లా) వడ్యాల్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి వరకు నా చదువు కొనసాగింది. అయితే అది ప్రభుత్వ పాఠాశాల అయినప్పటికి నా ఎదుగుదలలో ఆ స్కూలు మరియు నా గురువుల పాత్ర అనిర్వచనీయమని చెప్పగలను. వారితో నాకు చాలా సన్నిహిత్యం ఉండేది. అయితే మా క్లాసులో మిత్రులందరం ఒకసారి కలిసి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకుందాం అని నిర్ణయించినపుడు, వారిని దగ్గరగా చూసిన వ్యక్తిగా వారిపై ఉన్న అభిప్రాయాలను కవితల రూపంలో చెప్పాలని నిర్ణయించి శంకర్‌కి ఫోన్ లో చెప్తె తను వాటిని వ్రాసుకోవడం జరిగింది. విటన్నింటిని మా పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో వారికి చదివి వినిపిస్తె నా గురువులందరు ఎంతో సంతోషించారు. వాటిని కూడ ఈ పుస్తకంలో అచ్చు వేయాలనే మిత్రుల సలహాతో మీకందరి కోసం...





# గంగన్న సార్

ఒక గణితవేత్త, ఒక చిత్రకారుడు, ఒక తబలా వాయిద్య కారుడు.

ఒక కవి, ఒక హిందీ పండితుడు, ఒక టైపిస్టు, ఒక ట్యూషన్ మాస్టర్.

చేతి వ్రాత కు జనాభా గణనలో జాతీయస్థాయి అవార్డు గ్రహీత.

తన తల్లి కోరికను ఎందరో తల్లులకు అందించిన ఒక మంచి అందమైన ఫోటోగ్రాఫర్.

ముత్యాలవంటి రాత, ముక్కు మీద కోపం, వెన్నెలాంటి మనస్సు, ఆఫీసులో తనే, తరగతిగదిలో తనే, శుభకార్యంలో తనే, ఇలా తన బహుముఖ ప్రజ్ఞతో ఎందరెందరినో మెప్పించిన,

గంగలాంటి నిర్మలమైన మనసు, గలగలపారే చురుకుదనముతో, గంగలా అన్నింటినీ ఇనుమడించుకునే విశాలహృదయం గల, చడీ చప్పుడు లేని మితబాషి,

ఇలా ఒక వ్యక్తి మనసుంటే ఎన్ని కార్యములనైన సమర్థవంతముగా అవలీలగా చేయగలనని నిరూపించి,

ఆదర్శ ప్రాయుడుగా నిలిచిన మా గంగన్న సార్ గారికి శిరస్సు వంచి పాదాభినందనాలు సమర్పిస్తూ...



# నారాయణ సార్

ఒక తెలుగు పండితుడు, ఒక గాయకుడు, ఒక నృత్యకారుడు,

ఒక రచయిత, కవి, హాస్య చతురత గల మహాగురువు,

తన తరగతి అంటే మాకు ఎంతో ఉప్పొంగే ఆనందం,

ఆయన మాట వింటే ఎనలేని హాస్యం, పిల్లలే కాదు పెద్దల్ని

కూడా మెప్పించగల బహువిషయ పాండిత్యం ఆయన సొంతం.

ఆయన లేని సాంస్కృతిక కార్యక్రమం ఉండదు.

పండితుడు, పామరుడు అందరూ ఊరు ఊరంతా అభిమానులే.

నువ్వు రంగులబుస్కొటా నా రవ్వలబుస్కొటా అంటే ఆడదా ఈ లోకం.

మాలో ఉన్న కలను వెలికితీసి జిల్లా స్థాయికి తీసుకెళ్లిన గొప్ప గురువు.

మాకే కాదు ఎందరెందరికో తీపి గుర్తులను మిగిల్చిన మా నారాణుడు నారాయణ సారు గారికి శిరస్సు వంచి పాదాభివందనాలు సమర్పిస్తూ...



# రమణయ్య సార్

జీవశాస్త్రంలో జీవముంటుందని, జీవితంలో ఎన్నో రసాయన సమీకరణాలు ఉంటాయని, చదువులో జీవితమును నేర్పిన ఒక గొప్ప గురువు.

మీరు తరగతి గదికి వస్తే మాకెంతో ఆనందం, కొడుతూ నవ్వించగలనేర్పరి.

తన పనిని కచ్చితంగా, కచ్చితమైన కాలంలో ముగించాలనే, విలువలుగలవ్యక్తి, ఒక మనిషి తన పనిని ఆనందిస్తూ ఎలా చేయాలో చెప్పిన వ్యక్తి.

మొక్క ఎదుగుతున్న కొద్ది ఎలా ఒదిగి ఉంటుందో నేర్పిన వ్యక్తి.

అందమైన మనస్సు, ఆహార్యంలో ఆరడుగుల ఆజానుబాహుడు, హృదయంలో రమణ మహర్షి.

ఒక సినిమా హీరో కంటే ఎక్కువగా అభిమానులు కలిగిన మా పాఠశాల మెగాపవర్‌స్టార్ మా రమణయ్య సార్ గారికి శిరస్సు వంచి పాదాభివందనాలు సమర్పిస్తూ...



# నాగన్న సార్

పేదరికం దేనికి అడ్డుకాదని, కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన కష్టజీవి.

ఆహార్యంలో సౌమ్యత్వం, మీ మాటలో లాలిత్యం,

తన విధిలో కోడెనాగు, మదిలో కరుణామయుడు,

అమీబా లో కూడా అందం ఉంటుందని, ఈ చెట్లు పుష్పాలు నిర్జీవమైన మీకు జీవితాలు ఇస్తాయని నేర్పిన మహామేదావి.

అన్న కానీ అన్న మా నాగన్న సారు గారికి శిరస్సు వంచి పాదాభినందనాలు సమర్పిస్తూ...



# లక్ష్మణ్ సార్


అవును, పేరులో మాత్రమే లక్ష్మణుడివి, కానీ ప్రతి శిష్యుడికి,
ప్రతీ సహచరుడికి రాముడిలాంటి అన్నవే.

మీరు చెప్పే చరిత్ర వింటూ, చరిత్ర సృష్టించాలనుకొన్నాము.

మీ భౌగోళిక శాస్త్రం ఈ నేలతల్లిపై ప్రేమ నేర్పింది.

డబ్బులోని నిజమైన విలువలను మీ అర్ధశాస్త్రం నేర్పితే,
మీరు నేర్పిన పౌర శాస్త్ర విలువలు మమ్మల్ని సమాజములో
బాధ్యతగా తలెత్తుకుని నిలబడే పౌరునిగా తీర్చిదిద్దింది.

మానవ సంబంధ విలువలు నేర్పిన మా మంచి లక్ష్మణుడు
లక్ష్మణ్ సారు గారికి శిరస్సు వంచి పాదాభివందనాలు
సమర్పిస్తూ...



# మోహన్‌రావు సార్

రావుగారు మీరు మా ఆరో తరగతిలో వచ్చారు మాకు ఆరు చెరువులనీళ్ళు త్రాగించారు.

ప్రయివేటు క్లాస్ అంటారు, ఇంగ్లీష్ క్లాస్ అంటారు, జనరల్ నాలెడ్జ్ అంటారు. మనోవిజ్ఞాన శాస్త్రం అంటారు, వాటన్నింటి విలువలు ఆ రోజు తెలియలేదు.

ఏదో పెళ్లి కాని కుర్రోడు ఆవేశంలో ఉన్నాడులే అనుకున్నాం.

ఏదో డబుల్ ఎం.ఎ. చేశాడు కదా! మాపై రుద్దాలను కుంటున్నాడు, అనుకున్నాం.

ప్రతి రోజు నీవేమి కావాలనుకుంటున్నావని అడుగుతుంటే నిజంగా ఏదో కావాలనే తపన అది మాలో రగుల్చుతుందని తెలియలేదు అపుడు.

విజ్ఞానాన్ని పెంచుకోవాలనే మీ జిజ్ఞాస, మీరు మాలో నింపిన కసి, అంతా ఇంతా కాదు.

అరు నెలల్లోనే ఇంగ్లీషు పాఠం చదివే స్థాయికి తెచ్చారు.

ఒక ప్రభుత్వ పాఠశాలనుండి ఒక గొప్ప డాక్టర్ కావాలనే తపనను మాలో రగిల్చారు.

అందరు గురువులకు పిల్లలందరూ సొంత పిల్లలే, కానీ అది మాకు సినిమాలు చూపిస్తూ, మీ ఇంటికి తీసుకెళ్తూ నిరూపించారు.

మా జీవితంలో ఒక గురువుకు పెళ్లి చేసిన ఘనతను మాకు మిగిల్చారు.

ప్రేమలో నిజంగా మోహనుడు, క్రమశిక్షణలో రాముడైన మా మోహన్‌రావు సార్ గారికి శిరస్సు వంచి పాదాభివందనాలు సమర్పిస్తూ....



# ప్రతాపరెడ్డి సార్

సురవరం ప్రతాపరెడ్డిని మేము చూడలేదు. కమ్యూనిస్టు భావాలు
అంటే మాకు తెలియదు.

నిక్కచ్చిగా, సూటిగా, న్యాయంగా, నిజాయితిగా మాట్లాడడమే
ఆ పై రెండు అని మిమ్మల్ని చూసాక అర్థమయ్యింది.

ఎవరికి వచ్చినట్టుగా వారు బ్రతకాలని అంటారు.

కానీ చేస్తున్న పనిని దైవముగా భావించాలి అనేది మీరు నేర్పారు.

మీ సుపుత్రుడి రూపంలో మాకు మంచి మిత్రుడిని ఇచ్చారు.

మీ ఇంగ్లీషు పాండిత్యంతో మాకు ఎన్నో మెళకువలు నేర్పారు.

మీ కచ్చితత్వం మాకప్పుడూ నచ్చక పోయినా, ఇప్పుడు జీవితంలో
దాని విలువ అనిర్వచనీయమని తెలిసింది.

కమ్యూనిస్టు కాని మా రెడ్డిగారు, కవి కాని మా సురవరం గారు,
అయిన మా ప్రతాపరెడ్డి సార్ గారికి శిరస్సు వంచి
పాదాభివందనాలు సమర్పిస్తూ...



# నారాయణవర్మ సార్

హిందీని కూడా ఒక అందమైన అమ్మాయి లాగ వర్ణించగల సకలకళా పోషకుడు.

అందరినీ కలిపి ఉంచే బంగారు సూది, దారం.

పిల్లలను ప్రేమించడంలో తెలివికి విలువని ఇవ్వని గురువు, ఇంకా చెప్పాలంటే వెనుక బెంచి పిల్లలంటేనే అమితమైన ప్రేమ మీకు.

విశాలహృదయం, ఉదారస్వభావం మీ సొంతం.

ఆశలు ఆశయాలతో పాటు, ఆనందం విలువ నేర్పిన గురువు.

అందులో మా పాఠశాలఅందగాడు మా నారాయణవర్మ గారికి శిరస్సు వంచి పాదాభివందనాలు సమర్పిస్తూ...



# రఘోత్తము రెడ్డి సార్

పేరు వింటేనే భయం, మాటలంటే ఇంకా భయం.

మీసం మెలివేసె సినిమా హీరోలను మీరు ఇప్పుడు చూస్తున్నారు

కానీ మేము ఎప్పుడో చూశాం.

మిలటరీ శిక్షణ అంటే ఏంటో మాకు చిన్నప్పుడే రుచి చూపించారు.

క్రమశిక్షణకు మారుపేరు. కచ్చితత్వం మీరిచ్చిన కానుక.

తప్పు చేయనప్పుడు ఎవరికీ భయపడనవసరం లేదని,

తప్పు జరిగినప్పుడు ఎవరినైనా ప్రశ్నించవచ్చని చెప్పిన మొదటి గురువు.

ఆకారం భయానకమైన, మీ ప్రేమ ఎంతో మధురం, విలువలు ఎంతో ఆచరణీయం.

మీ అర్ధాంగి రూపంలో మాకు ఒక మంచి అమ్మ నిచ్చిన సకలగుణోత్తముడైన మా రఘోత్తమ రెడ్డి సారుకు శిరస్సు వంచి పాదాభివందనాలు సమర్పిస్తూ...



# నిర్మలమేడం

నిర్మల్ ఊరు తప్ప నిర్మలమైన హృదయం ఒకటి ఉంటుందని
మిమ్మల్ని చూశాక తెలిసింది.
ఇంటిలోనే కాదు బడిలో కూడా అమ్మలు ఉంటారని మీ ద్వారా
తెలిసింది.
మీరు పాఠం చెబుతుంటే గోరు ముద్దలు తినిపిస్తున్నట్లు ఉండేది.
ఇంకా గుర్తుందమ్మా మీరు వెళ్లిన రోజు మేము ఏడ్చినట్టు.
ఎంతో ప్రేమతో మేము కొనిచ్చిన ఆకుపచ్చ చీర గుర్తుందా తల్లి !
మీ గొంతులో మాధుర్యము, పిలుపులో ప్రేమ, పిల్లలు
బాగుపడాలనే మీలోని తపన,
మీరు చిరస్థాయిగా మా మనసులో నిలిచేటట్లు చేశాయమ్మా.
అప్పుడు ఇప్పుడు మీ కంటిచూపుతో ప్రేమను, బాధ్యతలు
చూపించారమ్మా, ఇప్పుడు ధ్వని తగ్గినా వాటిని
ఆస్వాదిస్తున్నామమ్మా.
మా పాఠశాలను నిర్మల్ హృదయ్‌గా మలచిన తెరిసా కానీ మా
మదర్ నిర్మలమేడం గారికి శిరస్సు వంచి పాదాభివందనాలు
సమర్పిస్తూ...



# సాయిరాం సార్

బోధన విషయము సాంఘీకశాస్త్రము అయినప్పటికీ,

మాకు సులభమైన పద్ధతులతో అర్ధమయ్యే రీతిలో

గణితము బోధించిన మా మంచి మాస్టరు.

పేరులోనే కాదు హృదయములోను, పిలుపులోను,

సాయినాధుడు అయిన మా సాయిరాం సారుకు శిరస్సు వంచి

పాదాభివందనాలు సమర్పిస్తూ...



# సత్యనారాయణ సార్

బహుశా ఎవరికీ ఈ అవకాశం దక్కదేమో మాకు మాత్రమే 1 నుండి 10వ తరగతి వరకు ఒక్కరే పెద్దసారు.

పెద్దసార్ అంటేనే మీరు.

పెద్దసారు కు పర్యాయ పదమయ్యారు.

ఎందరెందరికో పెద్దదిక్కు అయ్యారు

అకుంటిత దీక్ష, పరిపాలన దక్షత మీ ఆయుధాలు.

క్రమశిక్షణ, నిరంతర కఠిన పర్యవేక్షణ మీ అలంకారాలు.

మా ఊరు పేరును మీ ఇంటి పేరుగా మార్చుకున్నారు,

కానీ మా ఊరిని జిల్లా స్థాయికి చేర్చారు.

మీరు పాఠశాలకే పెద్దసారు కాదు మా ఊరికి పెద్దసారు.

ప్రయివేటు పాఠశాలలకు దీటుగా నడిపారు మీరు ఈ పాఠశాలను, మరి సాటిరారెవ్వరు ఈ పోటీలో మీకు.

స్కూల్ డే, పేరెంట్స్ డే, సైన్స్ ఫేర్, ఇలా ఎన్నెన్నో పరిచయం చేశారు.

మీ జీవితంలో అగ్ర భాగం పాఠశాలకే ధారాదత్తం చేశారు. మేమే మీ రెండో కుటుంబం అని నమ్మారు.

సత్యం పాటించే గురువు. చతురత తెలిసిన నారాయణుడు మీరు.

ఈ గ్రామం, ఈ పాఠశాలఉన్నంత కాలం మీ పేరు అజరామరం.

మీరు ఈ పాఠశాలరూపంలో, మా రూపంలో ఎప్పుడూ చిరంజీవులే.

ఆ భగవంతుడికి పరిపాలనలో సహాయం అవసరమైంది కాబోలు, మిమ్మల్ని ఎంచుకున్నాడు.

మాకు తెలుసు మీరెక్కడున్నా మమ్మల్ని దీవిస్తూనే ఉంటారు.

మీ అభిమానాన్ని ఆనందిస్తూ, మీ ఆశయాలను ఆచరిస్తూ, మీరెప్పుడూ తలెత్తుకుని ఉండేలా మేముంటామని మాటిస్తూ...

త్రిమూర్తులకు సహాయంచేయడానికి వెళ్ళిన మా శ్రీ సత్యనారాయణుడికి శోకతప్త హృదయాలతో అంజలి ఘటిస్తున్నాను...



# శంకరయ్య సార్

పెద్దసార్ కు కోపం వచ్చిందంటే తగ్గించే శక్తి మీలో ఉంది.

తోటి టీచర్లకు కష్టమొచ్చింది అంటే పెద్ద సారుకు చెప్పే ధైర్యం మీకుంది.

వారధి కి నిర్వచం మీరు.

మీరెప్పుడు పెద్దవాళ్లకు మాత్రమే చెప్పే సారు అని మాకు గుర్తు.

ఎన్నో గురుతర బాధ్యతలు మోసిన రెండవ పెద్ద సారు మీరు.

మా అందరి విహారయాత్రలు మీ చలవే.

బాషలెన్నో తెలిసినా మీరు మిత భాషి.

మీ ఇంగ్లీషు రైమ్స్ ఇంకా నాకు గుర్తున్నాయి.

ఈశ్వరుడికి మంచి మిత్రుడు కావలసి వచ్చింది కాబోలు, మిమ్మల్ని శివైక్యం చేసుకున్నాడు.

మాపై మీ ప్రేమానురాగాలు పదిలంగా దాచుకున్నాము.

మీ అభిమానాన్ని ఆనందిస్తూ, మీ ఆశయాలను ఆచరిస్తూ, మీరెప్పుడు తలెత్తుకొని ఉండేలా మేము ఉంటామని మాటిస్తూ...

మా ఆదిగురువు శంకరుడికి శోకతప్త హృదయాలతో అంజలి ఘటిస్తున్నాము...

# దానం జ్ఞానేశ్వర్

ఆటలన్నా పిల్లలన్నా అమితమైన ప్రేమ మీకు.

క్రమశిక్షణకు మారుపేరు మీరు.

ప్రార్థన సమయం ప్రాముఖ్యతను తెలిపారు మాకు, ఆటపాటలవిలువ నేర్పారు మాకు

బేటా అని పిలిచే కరుణామయుడు, దారితప్పితే బెత్తానికి పనిచెప్పే ఉగ్ర నరసింహుడు.

ప్రతి విద్యార్థికి మీరు మిత్రులే.

మాకు తెలిసిన మొదటి మరియు చివరి పి.ఇ.టి. సారు మీరే.

పేరులోనే కాదు దానం, జ్ఞానం, ఆచరణలోనూ చూపించారు మాకు.

మీరు మా పై చూపించిన ప్రేమ అనిర్వచనీయం, మాతో గడిచిన క్షణాలు అపురూపం.

ఆ కరుణామయుడికి మీ కరుణ కావలసి వచ్చింది కాబోలు, మిమ్మల్ని ఆవహించాడు.

మీ అభిమానాన్ని ఆనందిస్తూ, మీ ఆశయాలను ఆచరిస్తూ,
మీరెప్పుడు తలెత్తుకుని ఉండేలా మేము ఉంటామని మాటిస్తూ...
జ్ఞానాన్ని, దానాన్ని నేర్పిన ఈశ్వరుడు దానం సారుకు శోకతప్త హృదయాలతో అంజలి ఘటిస్తున్నాము...



## రచయిత గురించి

డా॥ విమలాకర్ రెడ్డి గారు ఒక చిన్న రైతు కుటుంబంలో నిర్మల్ జిల్లా (పాత ఆదిలాబాద్ జిల్లా) వడ్యాల్ గ్రామంలో 1980 మే 25న (కరెక్ట్ తేది తెలియదు ఒక అంచనా ప్రకారం నిర్ణయించుకోబడినది) జన్మించినారు. అదే గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి వరకు విద్యనభ్యసించి, ఆ తర్వాత ఎంసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి, గాంధీ మెడికల్ కాలేజీలో ఎం.బి.బి.ఎస్ పూర్తి చేశారు. ఆపై సర్జరి పై ఉన్న మక్కువతో హైదరాబాద్‌లో సర్జరిలో పి.జి. పూర్తి చేసి, సూపర్ స్పెషాలిటిలో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించి, మినాక్షి మిషన్ హాస్పిటల్ అండ్ రిసర్చ్ సెంటర్, మధురైలో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ పూర్తి చేశారు. చదువు పూర్తి అయిన తర్వాత సన్‌షైన్ హాస్పిటల్ హైదరాబాద్ లో గత 4.5 సంవత్సరాలుగా ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, లాప్రోస్కోపిక్ మరియు లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్‌గా సేవలు అందిస్తున్నారు. తన వృత్తితో పాటు తెలుగు మరియు సాహిత్యం పై ఉన్న మక్కువతో అప్పుడప్పుడు కొన్ని రచనలు చేస్తుంటారు.

- టీం విమలాకర్